క్లుప్తంగా...

చిలుకానగర్‌లో పార్కుల అభివృద్ధికి కృషి



పార్కుల పరిస్థితిని వివరిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం డివిజన్ పరిధిలోని పార్కుల్లో వసతులపై జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆరా తీశారు. నార్త్ కళ్యాణపురి, బాలాజీ ఎన్‌క్లేవ్, అజ్మత్‌నగర్ తదితర పార్కులను పర్యవేక్షించారు. పార్కుల్లో మౌలిక సదుపాయాలు, ఆట పరికరాలు, ప్రతి పార్కులో వాచ్‌మెన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీడీ రాజ్‌కుమార్, సర్కిల్ ఈఈ నాగేందర్, డీఈ నిఖిల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలకు చెక్



రామంతాపూర్: సమాజంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని ట్రాఫిక్ పోలీస్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అసిస్టెంట్ కమిషనర్ జి.శంకర్‌రాజు అన్నారు. మంగళవారం రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాలలో నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అతివేగంగా వాహనం నడుపుతూ ఇతరులను ప్రమాదాలకు గురిచేస్తూ తాము కూడా ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు బైకులు ఇవ్వొద్దని సూచించారు. రోడ్లపై జీబ్రా క్రాసింగ్ వద్ద పాదచారులు రోడ్డు దాటుతున్నప్పుడు వాహనాలను ఆపాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి క్షేమంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమూర్తి, ఏఎస్సై సయ్యద్ వికారుద్దీన్, కృష్ణ, నరేందర్ ఉన్నారు.

నెలరోజుల పాటు జన సంపర్క్ అభియాన్



ఉప్పల్‌లో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

ఉప్పల్: ప్రధాని నరేంద్ర మోదీ పాలన 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి జాగృతం చేయనున్నట్లు బీజేపీ ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్ తెలిపారు. మంగళవారం ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ నాయకులు మహాంకాళి లక్ష్మణ్, రేవల్లి రాజు, డా.అన్సారీ, రావుల బాలకృష్ణతో కలిసి మాట్లాడారు. దేశంలోని దాదాపుగా 80 కోట్ల మంది ప్రజల్ని ప్రత్యక్షంగా కలిసి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించనున్నట్లు తెలిపారు. జాతీయ నాయకుడు జేపీ నడ్డా స్థాయి నుంచి మొదలుకొని పోలింగ్ బూత్‌స్థాయి కార్యకర్తలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం వెనుకబడిన, అట్టడుగు వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు. నవ భారత నిర్మాణం కోసం జరిగే కృషిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బుధవారం ఉప్పల్‌లోని కేకే గార్డెన్స్‌లో సంయుక్తా మోర్చాల సమ్మేళనం జరుగుతుందని, కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, నాయకులు పన్నాల హరీష్, కార్పొరేటర్లు కక్కిరేణి చేతన, బండారు శ్రీవాణి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తాళ్ల లింగం, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

పోచారం: ఇద్దరు గంజాయి విక్రేతలను ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ మల్లయ్య వివరాల ప్రకారం.. కీసర మండలంలోని అంకిరెడ్డిపల్లి జంక్షన్ వద్ద అనుమానితులను తనిఖీ చేయగా ఇద్దరి దగ్గర గంజాయి దొరికింది. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు ఒడిశాకు చెందిన సంగ్రామ్ ప్రధాన్(25), ఉత్కల్ బెహరా అని తెలిసింది. ఒడిశా నుంచి తక్కువ ధరకు గంజాయిని తెచ్చి నగరంలోని కాలేజీ విద్యార్థులకు, గంజాయి బానిసలకు ఎక్కువ రేటుకు అమ్ముతున్నట్లు చెప్పారు. వారినుంచి 5 కేజీల గంజాయితో పాటు సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐలు పురుషోత్తం రెడ్డి, శ్రావణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లకు మోక్షమెప్పుడో?

తవ్వారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు..

- కంకర వేసి నెల గడిచినా గతిలేదు..
- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు
- ఫిర్యాదు చేసినా పట్టదా అంటూ ఆగ్రహం



ఎస్‌ఎఫ్‌సీ కాలనీలో వెయాల్సిన రోడ్డు

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్‌లో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. రోడ్లు, డ్రైనేజీలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఎన్నో కాలనీల్లో డ్రైనేజీలు, రోడ్లు రోజు రోజుకూ అభివృద్ధి చెందుతుండగా మల్లాపూర్‌లో ఎస్‌ఎఫ్‌సీ కాలనీ, నాగలక్ష్మీనగర్ కాలనీలు మాత్రం కనీస సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. డ్రైనేజీ, రోడ్లను త్వరితగతిన వేయాలని స్థానిక కాలనీవాసులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే లేకుండా పోయారు.

నెల క్రితం రోడ్ల చదును..

మల్లాపూర్ నాగలక్ష్మీనగర్ కాలనీలో నెల రోజుల క్రితం రోడ్లు వేస్తామని కాంట్రాక్టర్, అధికారులు హడావుడి చేసి ఇళ్ల ముందు ఉన్న ర్యాంప్‌లను తొలగించారు. గుంతలు ఉన్న రోడ్లపై కంకర, డస్ట్ మట్టిని వేసి చదును చేసి వదిలేశారు. కాలనీవాసులు రోడ్డును ఎప్పుడు పూర్తి చేస్తారని అడిగితే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు.



నాగలక్ష్మీనగర్ కాలనీలో కంకర వేసి వదిలేసిన రోడ్డు

అసంపూర్తిగా డ్రైనేజీ పనులు

మల్లాపూర్ శ్రీలక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్ సమీపంలో అసంపూర్తి డ్రైనేజీతో ఎస్‌ఎఫ్‌సీనగర్ కాలనీవాసులు, శ్రీనివాస్, సాయిప్రియం సుప్రభాత్ అపార్ట్, మరో నాలుగు కొత్త అపార్ట్‌మెంట్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ధర్నాలు, నిరసనలు, వినతి పత్రాలు ఇవ్వగా ఎస్‌ఎఫ్‌సీనగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. రోడ్డును తవ్వేయడంతో రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు త్వరితగతిన డ్రేనేజీ పనులు పూర్తి చేసి, రోడ్డు వేయాలి.

– శ్రీనివాస్‌దేవ్, సుప్రభాత్ రెసిడెన్సీ, మల్లాపూర్.

వారంలో పూర్తి చేస్తామన్నారు



మల్లాపూర్ నాగలక్ష్మీనగర్ కాలనీలో వారం రోజుల్లో రోడ్లను వేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు అవసరమైన చోట కంకర మట్టి వేసి వదిలేశారు. కొన్ని కాలనీల్లో ప్రారంభించిన వెంటనే వేస్తున్నారు. నాగలక్ష్మీనగర్ కాలనీలో మాత్రం అధికారులు, కాంట్రాక్టర్ వివక్ష చూపుతున్నారు.

– పీజీ.సుదర్శన్, నాగలక్ష్మీనగర్ కాలనీ అధ్యక్షుడు

త్వరలోనే పూర్తి చేస్తాం

డ్రైనేజీ పైప్‌లు వేసిన వెంటనే రోడ్డు వేస్తే క్రాక్స్ వస్తాయని వేయలేదు. త్వరలోనే రోడ్డు వేస్తాం.. నాగలక్ష్మీనగర్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న రోడ్లను పూర్తి చేస్తాం.

– స్రవంతి, మల్లాపూర్ ఏఈ.

పారిశ్రామిక రంగంలో దేశానికే రోల్‌మోడల్



చర్లపల్లిలో పారిశ్రామిక ప్రగతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

- ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి
- చర్లపల్లి పారిశ్రామికవాడలో ఉత్సవాలు

కుషాయిగూడ: పారిశ్రామికరంగం అభివృద్ధిలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని సీఐఏ ఆడిటోరియంలో నిర్వహించిన తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి జాతీయ జెండాను ఎగురవేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ పారిశ్రామికరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. టీఎస్‌ఐపాస్‌ను ఏర్పాటు చేసి నెల రోజుల్లో పరిశ్రమల అనుమతులు, పరిశ్రమల నిర్వహణకు కావాల్సిన తోడ్పాటు అందించి తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి బాటలు వేశారన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు కూడ పెరిగాయన్నారు. గతంలో లేని విధంగా పరిశ్రమలకు 24 గంటల కరెంటు అందించడంతో ఉత్పత్తి, మార్కెటింగ్ రంగాలు కూడా అభివృద్ధి చెందాయన్నారు. తెలంగాణ ఇండస్ట్రీయల్ ఫెడరేషన్(టిఫ్) రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన రోజు 5 వేల ఎకరాలు ఉన్న పారిశ్రామికవాడలు నేడు లక్ష 50 వేల ఎకరాలకు చేరుకుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 90 పారిశ్రామికవాడలను అభివృద్ధి చేశారని, మరో 60 పారిశ్రామికవాడల అభివృద్ధికి కూడా సన్నాహకాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, సింగిరెడ్డి శిరీషా సోమశేఖరరెడ్డి, ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, ఇండస్ట్రీయల్ కమిషనర్ ఉమామహేశ్వర్, కాప్రా, ఉప్పల్ సర్కిళ్ల డీసీలు శంకర్, అరుణకుమారి, ఐలా చైర్మన్ రోషిరెడ్డి, సీఐఏ అధ్యక్షుడు గోవింద్‌రెడ్డి, టీఫ్ ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, వివిధ పారిశ్రామికవాడల ప్రతినిధులు మహిపాల్ రెడ్డి, రఘుపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కరణ్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీధి కుక్కలను ఆదరిద్దాం..

మేడిపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కమిషనర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో వీధి కుక్కలను దత్తత తీసుకున్నవారికి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సుమారుగా 150 మంది జంతు ప్రేమికులు హాజరయ్యారు. వీధి కుక్కలను రక్షించడంతో పాటు వాటి నుంచి నగర ప్రజలను రక్షించాల్సిన బాధ్యత తమపై ఉందని మేయర్ జక్కా వెంకట్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా పీర్జాదిగూడలో ఎనిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సెంటర్‌లో ఇప్పటి వరకు 5,600 కుక్కలకు ఎనిమల్ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేశామన్నారు. 1,200 కుక్కలకు త్వరలోనే ఆపరేషన్లు పూర్తి చేస్తామన్నారు. వీధి కుక్కలను దత్తత తీసుకున్న వారికి ప్రశంసా పత్రాల్ని అందజేశారు.

ఓటరు జాబితాలో మార్పులు.. చేర్పులపై సమీక్ష



ఓటరు జాబితాపై సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్

కాప్రా: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులపై సర్కిల్ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బందితో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్ సమీక్ష నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లు కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి, మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, నాచారం, మల్లాపూర్‌లో మొత్తం 2,88,989 మంది ఓటర్లు ఉన్నారని, అందుకుగాను 221 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు డీసీ శంకర్ తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు చెందిన బీఎల్‌ఓలను సమన్వయం చేసేందుకు 15 మంది సూపర్‌వైజర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అందరి సమన్వయంతో సర్కిల్ పరిధిలో ఓటరు జాబితాలో తప్పొప్పులు సరిదిద్దడం, చిరునామా మార్పులు, ఓటరు బదిలీల ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. అందుకు ఆయా ప్రాంతాల్లో తిరిగే బీఎల్‌ఓలకు ఆయా కాలనీసంఘాల ప్రతినిధులు, రాజకీయ నేతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, వివిధ కాలనీ సంఘాల ప్రతినిధులు, రాజకీయ నేతలు పాల్గొన్నారు.

ఒడిశా రైలు ప్రమాద మృతులకు ఆత్మశాంతి కలగాలి



ఉప్పల్: ఒడిశా రైలు ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ తెలంగాణ ఇండిపెండెంట్ చర్చెస్ యూనియన్ ఆఫ్ ఇండియా చీఫ్ బిషప్ విల్సన్ సింగం ఆధ్వర్యంలో క్రైస్తవ నాయకులు ఉప్పల్ చౌరస్తాలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విల్సన్ సింగం మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. జెరుసలేం మత్తయ్య, డా.జంపాల శ్రీనివాస్, శ్యాంసన్ సేన, క్రైస్తవ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దత్తత అభినందనీయం

బోడుప్పల్: చెంగిచర్ల ఎంఎల్‌ఆర్ కాలనీ మాజీ అధ్యక్షుడు వింజమూరి సుధాకర్ కుమారుడు వినయ్ వీధి కుక్కలను దత్తత తీసుకున్నందుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. కొంత మంది ఎన్‌జీఓలు టీమ్‌గా ఏర్పడి వీధి కుక్కలను దత్తత తీసుకుని వాటికి ఆహారం, నీళ్లు అందిస్తూ వాటి ఆలనా పాలనా చూసుకుంటున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి వినయ్‌ను అభినందించి సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ కొంతకాలంగా వీధి కుక్కలకు చేస్తున్న సేవలను గుర్తించి అభినందించడంతో మా టీమ్‌కు మరింత బాధ్యత పెరిగిందన్నారు.



వినయ్‌కి సర్టిఫికేట్‌ను అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

ఆపదలో అండగా బీఎల్‌ఆర్..



ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధి మహేష్‌గౌడ్

కుషాయిగూడ: ఆపదలో ఉన్న పేదలకు బీఎల్‌ఆర్ ట్రస్టు అండగా నిలుస్తుందని ట్రస్టు ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్ అన్నారు. చర్లపల్లి డివిజన్, ఐజీ కాలనీకి చెందిన యూసుఫ్ కూతుళ్లు షేక్ సారా, షేక్ సానియా, షేక్ అయిషాల పైచదువుల కోసం ట్రస్టు చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. సామాజిక సేవా భావనతోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఎంకిర్యాల నర్సింహ, సాయిగౌడ్, శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు ఆర్‌ఎల్‌ఆర్ పాదయాత్ర



కాప్రా డివిజన్‌లో పాదయాత్రలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రాగిడి లక్ష్మారెడ్డి

కాప్రా: ఉప్పల్ నియోజకవర్గంలోని సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకు పాదయాత్ర చేపట్టారు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి. కాప్రా డివిజన్ సాయిబాబానగర్, న్యూఇందిరానగర్‌లో మంగళవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. సాయిబాబానగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్ర ప్రారంభించిన ఆయన గడపగడపకూ తిరుగుతూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి తాగునీటి పైప్‌లైన్లలో కలిసి తాగునీరు కలుషితమవుతోందని ఆరోపించారు. సాయిబాబానగర్, న్యూఇందిరానగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఐదేళ్లుగా ఎవరికీ కేటాయించకుండా ప్రజలను మభ్యపెడుతూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. తక్షణమే డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు కేటాయించాలని, లేదంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అర్హులైన వారందరికీ దళితబంధు ఇవ్వాలని, నియోజకవర్గంలో రేషన్ కార్డుల కోసం 30 వేల మంది దరఖాస్తు చేసుకోగా ఏ ఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వకుండా పేదలను పస్తులుంచుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కొత్త అంజిరెడ్డి, పత్తికుమార్, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, పెద్ది శ్రీనివాస్, పోచయ్యగౌడ్, గోపాల్‌యాదవ్, అంజయ్య పాల్గొన్నారు.

నిమిషాంబిక దేవికి పూజలు



బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీనిమిషాంబిక దేవి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌శర్మ వెల్లడించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజల సందర్భంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బీజేపీ నాయకులు సర్కిల్ ఉపకమిషనర్ నాగమణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మల్కాజిగిరి నియోజకవర్గం కన్వీనర్ సదానంద్‌గౌడ్, సీనియర్ బీజేపీ నాయకులు దండుగుల వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్వాల్ సర్కిల్ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని రోడ్లు గుంతలమయంగా మారాయని, కాలనీల్లో ఎలక్ట్రికల్ పోల్స్ లేక చీకటిమయంగా మారాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. అలాగే అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని, దళిత బంధు స్కీమ్ దళితులకు వర్తింపజేయాలని, ఉచిత మంచినీటి సరఫరా చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. బృందావన్ కాలనీ నుంచి ఐస్ ఫ్యాక్టరీ వరకు రోడ్డును పూర్తి చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కర్తీక్‌గౌడ్, రవికిరణ్, వాసంశెట్టి శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సంతోష్‌గౌడ్, శేఖర్, లక్ష్మణ్, మల్లికార్జున్ యాదవ్, మాచర్ల శ్రీనివాస్, గోపి, అనిల్‌సింగ్, మల్లికార్జున్‌గౌడ్, అనిల్, వినయ్, కరుణశ్రీ, సుజాత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



డీసీ నాగమనికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చెరువుల పండగను విజయవంతం చేయాలి

– ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కాప్రా: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 21 రోజుల పాటు నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా ఈ నెల 8న ఊరూరా చెరువుల పండగ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంపై మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన ఊరూరా చెరువుల పండగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని కాప్రా చెరువు, చర్లపల్లి చెరువు, నాచారం చెరువు, రామంతాపూర్‌లోని పెద్దచెరువు, నల్లచెరువు వద్ద ఏర్పాట్లపై దిశానిర్దేశం చేస్తూ పలు సూచనలు చేశారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రం అతిస్వల్ప కాలం తొమ్మిదేళ్లలో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో మరే రాష్ట్రంలో లేవన్నారు.

తెలంగాణ ఆచరిస్తుంటే.. దేశం అనుసరిస్తోందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో నీటిపారుదల రంగంలో తొమ్మిదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రగతి, రాష్ట్ర ఏర్పడకముందు, రాష్ట్రం సాధించిన తర్వాత జరిగిన అభివృద్ధి, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథతో పెరిగిన భూగర్భ జలాలపై ప్రజలకు వివరించేలా కార్యక్రమం ఉండాలని సూచించారు.